సాక్షి
అనంతపురం
మంగళవారం । 27 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.22,500

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,500 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.7. సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.4°/23.6°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

‘పెద్దారెడ్డి నియోజకవర్గ బహిష్కరణ అవాస్తవం’



తాడిపత్రి టౌన్: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని నియోజకవర్గ బహిష్కరణ చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ తాడిపత్రి కార్యాలయం సోమవారం వెల్లడించింది. ఎస్పీ ఆదేశాల మేరకు తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే నివాసం వద్ద నోటీసులు అంటించారంటూ వస్తున్న వార్తలను ఖండించింది. సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించింది. త్వరలో కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపింది.

దొంగతనాల నియంత్రణకు చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సెంట్రల్: దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశించారు. సోమవారం నగరంలోని నాల్గో పట్టణ పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ప్రముఖుల భద్రత, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడకూడదన్నారు. మహిళలపై జరిగే నేరాలపై తక్షణం స్పందించాలన్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లను అరికట్టాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. రాత్రి సమయాల్లో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. బ్లూకోల్ట్, రక్షక్ సేవలను మరింత మెరుగుపర్చాలని, అన్ని చోట్ల సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసేలా చూసుకోవాలని సూచించారు. సీఐ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

టమాటలు రోడ్డు పక్కన పడేయొద్దు



టమాట బాక్సులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

రాప్తాడురూరల్: టమాటలను రోడ్లపక్కన పడేయరాదని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ సూచించారు. అనంతపురం రూరల్ మండల పరిధి కక్కలపల్లి సమీపంలోని టమాట మండీని ఇన్‌చార్జ్ కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులతో ఆయన మాట్లాడారు. టమాట ‘నో సేల్’ పడేందుకు కారణమేంటి అని ఆరా తీయగా, వర్షాల వల్ల కాయకు మచ్చ రావడంతో పంట కొనుగోలు చేయలేదని వ్యాపారులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దగ్గరలోని డంపింగ్ యార్డ్ వద్ద టమాటలు పడేయాలని సూచించారు. వీలైతే పశువులు, గొర్రెలకు ఆహారంగా అందించాలన్నారు. నాణ్యమైన పంటకు మంచి ధరలు దక్కేలా చూడాలన్నారు. తహసీల్దార్ హరికుమార్, మార్కెట్ సెక్రటరీ రాంప్రసాద్ రావు ఉన్నారు.

భద్రత పటిష్టం చేయాలి



ప్రభుత్వ ఆసుపత్రుల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి. వాచ్‌మెన్‌లు 24 గంటలు ఉండేలా చూడాలి. అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు అమర్చాలి. ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించే మాకు రక్షణ లేకపోవడం బాధాకరం. కోల్‌కతాలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ సాహితి, సీహెచ్‌సీ వైద్యాధికారిణి, ఉరవకొండ

రక్షణ చట్టాలు తీసుకురావాలి



కోల్‌కతాలో జూనియర్ మహిళా వైద్యురాలి హత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చట్టాలు తీసుకురావాలి. దుండగులను కఠినంగా శిక్షిస్తే ఇంకొకరు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడాలంటే భయపడతారు. వైద్యులకు రక్షణ ప్రొటోకాల్ అవసరమని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయం. ప్రభుత్వాలు వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించినప్పుడే స్వేచ్ఛగా వైద్యం అందించగలుగుతారు.

– కీర్తి కిరణ్‌రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు, గుంతకల్లు

పవన పుత్రుడి మాన్యంపై పచ్చ గద్దలు!



టంగుటూరి సత్రాన్ని జేసీబీతో నేలమట్టం చేసిన దృశ్యం

- 150 ఏళ్ల సత్రాన్ని దిగ్విజయ'ంగా కూల్చేసిన టీడీపీ నాయకులు
- నియోజకవర్గ ప్రజాప్రతినిధి అండతో రూ.కోట్ల విలువైన మాన్యం భూమి కబ్జాకు యత్నాలు
- ఆంజనేయ స్వామి భూమి దురాక్రమణపై ప్రజల విస్మయం

పామిడి: అధికార మదం కన్నుమిన్నూ కానకుండా చేసింది. ఎవరేమనుకున్నా డోంట్ కేర్ అనుకుంది. ఏకంగా దేవుడి భూమిపైనే కన్నేసింది. మింగేసేందుకు తొలి అడుగేసింది. సత్రాన్ని దిగ్వి'జయ'ంగా నేల మట్టం చేసింది. పామిడి సమీపంలోని ఎద్దులపల్లి రోడ్డులో ఆంజనేయ స్వామి మాన్యంలో ఉన్న టంగుటూరి సత్రాన్ని సోమవారం అక్రమార్కులు కూల్చివేశారు. కృష్ణాష్టమి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడం, అధికారులు ఉండరన్న ధైర్యంతో అక్రమార్కులు దారుణానికి ఒడిగట్టారు. రెండు జేసీబీలతో సత్రం మొత్తం నేలమట్టం చేశారు.



కూల్చేయక ముందు సత్రం ఇలా..

రూ.5 కోట్ల విలువ గల భూమి..

సత్రాన్ని ఆనుకొని ఆంజనేయస్వామి ఆలయం, కోనేరు, బావి ఉన్నాయి. ఆలయానికి సంబంధించి కొంత భూమి బ్రాడ్‌గేజ్ రైల్వే ట్రాక్ ఏర్పాటుకు పోగా, మిగతా 4.50 ఎకరాల దాకా ఉంది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా రూ.కోటికి పైగా పలుకుతోంది. ఈ క్రమంలో మాన్యం విలువ రూ. 5 కోట్ల దాకా ఉంటుంది. దీంతో భూమిపై కన్నేసిన టీడీపీ నాయకులు ముందుగా సత్రాన్ని పడగొట్టినట్లు తెలుస్తోంది. ఆంజనేయ స్వామి ఆలయ భూమిని కబ్జా చేయాలని చూస్తున్న అక్రమార్కులపై మండల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

150 ఏళ్ల క్రితం దానం..

ఈ భూమిని టంగుటూరి వంశస్తులు 150 ఏళ్ల క్రితం దానంగా ఇచ్చారు. అందులో సత్రం, ఆంజనేయ స్వామి ఆలయం నిర్మించి, వాటి నిర్వహణకు గానూ భూమిని వాడుకోవాలనే ఉద్దేశంతో దానం చేశారు. ఈ క్రమంలో సత్రం నిర్మించి పడమటి భాగాన కోనేరు, బావితో కూడిన ఆంజనేయస్వామి ఆలయం కట్టారు. ఆలయ అర్చకుని కుటుంబం నివసించేందుకు సత్రంలో విడిది ఉండేది. ఒకప్పుడు ఈ ఆలయం నిత్యం ధూపదీపనైవేద్యంతో పాటు అన్నదాన కార్యక్రమాలతో విరాజిల్లేదని గ్రామస్తులు చెబుతున్నారు. బాటసారులు సేద తీర్చుకోవడానికి సత్రం ఎంతగానో ఉపయోగపడేది. భూమిలో మామిడి పంట పండించి విక్రయించగా వచ్చే ఆదాయంతో పూజారి ఆలయ ధూపదీప నైవేద్యానికి వినియోగించేవారు. రెండేళ్ల క్రితం వరకూ హనుమాన్ జయంతి ఘనంగా జరిగేది. ఆంజనేయస్వామి సన్నిధిలో పెళ్లిళ్లు చేసేవారు. పెళ్లి భోజనాలు సత్రంలోనే ఏర్పాటు చేసేవారు. ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు జరిపారు. గతంలో ఓ వృద్ధురాలు సత్రంలో ఉండేదని స్థానికులు అంటున్నారు. కొంతకాలానికే ఓ ఇద్దరు అన్నదమ్ములు అవ్వకు తోడయ్యారని, సిరిచాపలు అల్లుకుంటూ జీవనం సాగించేవారని, కొంత కాలానికి వృద్ధురాలి దగ్గర ఉన్న డబ్బు, నగలకు ఆశపడి ఆమెను అంతమొందించడంతో ప్రజలు ఆ సత్రం ఛాయలకే వెళ్లడం మానేశారని చెబుతారు. ఇక అప్పటి నుంచి సత్రం నిరుపయోగంగా మారిందని అంటున్నారు. ఇటీవల సత్రం పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో ఆ పరిసరాల్లో జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. దీన్ని ఆసరాగా చేసుకున్న అధికార పార్టీ నేతలు భూమిపై కన్నేసి ఏకంగా సత్రాన్ని కూల్చివేయడంపై మండలవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ అధికార ప్రజాప్రతినిధి అండతోనే స్థానిక ఆ పార్టీ నేతలు కబ్జాకు సాహసించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులు ఏమన్నారంటే..

సత్రం కూల్చివేతపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ. లక్ష్మి నారాయణరెడ్డి, పామిడి పంచాయతీ ఈఓ చంద్ర శేఖర్‌ను ‘సాక్షి’ ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించారు. అది ప్రభుత్వ స్థలమా, ప్రైవేట్ స్థలమా? అనే వివరాలు రికార్డుల్లో పరిశీలిస్తామన్నారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా అది ప్రభుత్వ స్థలమైతే అక్రమార్కులపై చర్యలు చేపడతామన్నారు.

రేపటి నుంచి ‘ఎస్‌ఏఎంపీ-1’

అనంతపురం ఎడ్యుకేషన్: గతంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ-1) పేరుతో నిర్వహించే పరీక్షలను ఈసారి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ (ఎస్‌ఏఎంపీ-1) పేరుతో నిర్వహిస్తున్నారు. రేపటి (28) నుంచి సెప్టెంబరు 4 వరకు జరుగుతాయి. ప్రశ్నపత్రాలను సోమవారం ప్రత్యేక వాహనాల ద్వారా తరలించారు. 1-8 తరగతులకు క్లాస్‌బేస్ అసెస్‌మెంట్ పద్ధతిలో ఓఎంఆర్ విధానంలో, 9,10 తరగతులకు రెగ్యులర్ విధానంలో నిర్వహిస్తారు. జిల్లాలో 1,750 స్కూళ్లల్లో 1.80 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 1-5 తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటలకు, 9,10 తరగతులకు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు, 6-8 తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు ఉంటాయి.

ప్రశ్నపత్రాల గోప్యతపై ఆందోళన

మండలాలకు తరలించిన ప్రశ్నపత్రాల గోప్యతపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ‘ప్రశ్నపత్రాలు లీకైతే కఠిన చర్యలు తప్పవు’ అంటూ హెచ్చరించారు. ఎమ్మార్సీల నుంచి గంటముందు మాత్రమే ప్రశ్రపత్రాల బండిళ్లు తీసుకెళ్లి పరీక్షకు ముందు మాత్రమే బండిల్ ఓపెన్ చేయాలని చెబుతున్నా.. ఇది ఎంతమాత్రం అమలవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కనిపించని డీఈఓ

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పరీక్షలపై జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి మాత్రం పట్టీపట్టనట్లు ఉన్నారు. ప్రశ్నపత్రాల తరలింపు బాధ్యతను డీసీఈబీ కార్యదర్శికి అప్పగించేసి అటువైపు చూడలేదు.

తరగతుల వారీగా పరీక్షల షెడ్యూల్

తేదీ	1-5	9,10	6-8
28	తెలుగు/ ఉర్దూ	తెలుగు/ ఉర్దూ	తెలుగు/ ఉర్దూ
30	ఇంగ్లిష్	హిందీ/ స్పెషల్ తెలుగు	హిందీ/ స్పెషల్ తెలుగు
31	గణితం	ఇంగ్లిష్	ఇంగ్లిష్
2	ఈవీఎస్	గణితం	గణితం
3	సైన్స్	సైన్స్	------
4	సోషల్	సోషల్	------

పంచాయతీలో బది‘లీలలు’

- గందరగోళంగా పీఆర్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ
- క్షేత్రస్థాయి ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన ఉన్నతాధికారులు

❐ సంవత్సరం క్రితం పొరుగు జిల్లా నుంచి ఓ డీఈఈ అనంతపురం ఎస్‌ఈ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. రూ.2 లక్షలకు పైబడి వేతనం అందుకునే ఆయన సంతకాలు పెట్టడం, జీతాలు తీసుకోవడానికే పరిమితమయ్యారు. అటువంటి వ్యక్తి తాజాగా జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో రెగ్యులర్ హోదాలో మళ్లీ అదే పోస్టు దక్కించుకున్నారు.

❐ జిల్లాకు చెందిన ఓ డీఈఈ చిత్తూరు జిల్లాలో 8 ఏళ్లుగా పని చేస్తున్నారు. సొంత జిల్లాకు రావాలని ప్రయత్నించి కౌన్సెలింగ్‌కు హాజరు కాగా, జిల్లాలోకి ఆమె అడుగుపెట్టకుండా ఎస్‌ఈ కార్యాలయంలో పని చేసే ముగ్గురు సీనియర్ ఉద్యోగులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఇతర జిల్లాలు, మండలాల్లో పని చేసే వారినీ అడ్డుకున్నట్లు సమాచారం.



కౌన్సెలింగ్‌కు హాజరైన రాయలసీమ జిల్లాల పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు

అనంతపురం సిటీ: జోన్-4 పరిధిలోని రాయలసీమ జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఉద్యోగులతో సహా అన్ని విభాగాల వారికి రీజనల్ కేంద్రమైన అనంతపురంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ చీఫ్ బి.బాలు నాయక్ సారథ్యంలో ప్రక్రియ సాగింది. మొత్తం 198 మంది ఉద్యోగులను కౌన్సెలింగ్‌కు పిలిచారు.

చక్రం తిప్పిన జిల్లా కార్యాలయ సిబ్బంది..

బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు కౌన్సెలింగ్‌లో పాతరేశారు. గతంలో ఒక చోట పోస్టింగ్ వచ్చి మరో చోట డిప్యుటేషన్‌పై కొనసాగిన ఉద్యోగులు ఆయా స్థానాల్లోకి రెగ్యులర్ హోదాలో వచ్చేశారు. జెడ్పీ ఆవరణలోని సబ్ డివిజన్ కార్యాలయాలతో పాటు క్వాలిటీ సెల్ విభాగం, పీఐయూ, పీఆర్ఐ విభాగాల్లో పని చేస్తున్న వారు మండలాలకు వెళ్లకుండా తిరిగి ఒక విభాగం నుంచి మరో విభాగానికి వెళ్లారు, లేదంటే ఎస్‌ఈ కార్యాలయానికి చేరుకున్నారు. వారంతా జిల్లా కేంద్రంలోనే ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రావాలనుకున్న వారి కలలు కల్లలయ్యాయి. అనంతపురంలోని ఎస్‌ఈ కార్యాలయం సహా క్యూసీ, పీఆర్ఐ, పీఐయూ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు కొందరు మాఫియా అవతారం ఎత్తి బదిలీల్లో చక్రం తిప్పినట్లు తెలిసింది. ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం.

సిఫార్సులకే పెద్దపీట..

పలుకుబడి లేక, పనే ప్రపంచంగా భావించిన ఉద్యోగులకు ఈ కౌన్సెలింగ్‌లో నిరాశే మిగిలింది. సాక్షాత్తు ఈఎన్‌సీ వచ్చి నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఇంత అధ్వానంగా ఉంటుందని తాము ఊహించలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో డీఈఈలు, పీఏలు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లెటర్లు తెచ్చుకొని తాము కోరుకున్న సీట్లను దక్కించుకున్నారు.

పీఏలు.. పీఏలుగానే?

జిల్లా ఎస్‌ఈ కార్యాలయంలో ఐదేళ్లు, అంతకు ముందు ఫారిన్ సర్వీసు కింద ఐదేళ్లు డ్వామాలో, డిప్యుటేషన్‌పై ఇంకో విభాగంలో ఇంకో ఐదేళ్లు మొత్తం 15 ఏళ్లు అనంతపురం జిల్లా కేంద్రంలో పని చేస్తున్న సీనియర్ డీఈఈని 50 కిలోమీటర్ల దూరంలోని నియోజకవర్గ కేంద్రానికి బదిలీ చేసినా అక్కడ కూడా సబ్ డివిజన్ కార్యాలయ పీఏగా పోస్టింగ్ ఇవ్వడంపై దుమారం రేగుతోంది. ఎస్‌ఈ, ఈఈలకు పీఏలుగా పని చేస్తున్న వారంతా డీఈ స్థాయి అధికారులే. ఇప్పటికే డీఈఈల కొరత ఎక్కువగా ఉంది. ఏఈఈలకు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకుంటుండడంతో పనులు ముందుకు సాగక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పీఏలను డీఈఈలుగా పంపిస్తారనుకుంటే వారిని ఒక చోట నుంచి మరో చోటుకు అదే హోదాలోనే పంపడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి

అనంతపురం సిటీ: పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) బి.బాలు నాయక్‌ను సోమవారం కలసి విన్నవించారు. మహిళలు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, ఉద్యోగంలో చేరినప్పటి నుంచి మండలాలకే పరిమితమైన ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్‌లో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎస్‌ఈ కార్యాలయంతో పాటు అనంతపురంలోని సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పాతుకుపోయిన పీఏలు, సూపరింటెండెంట్లు, ఇతర క్యాడర్ల ఉద్యోగులందరినీ మండలాలకు పంపాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానంటూ ఈఎన్‌సీ వారికి హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డీఎల్ మురళీ, కోశాధికారి పాండురంగారెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మీనారాయణ, డీఈఈ భరత్ ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

మేమింతే.. మారమంతే

- శింగనమల మండలంలో ఆగని ఇసుకాసురుల ఆగడాలు

శింగనమల: ‘ప్రభుత్వం మాది, ఎన్ని కేసులు పెట్టుకున్నా భయపడం, ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆపం’ అంటున్నారు టీడీపీ నాయకులు. తాజాగా శింగనమల మండలంలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనే అందుకు నిదర్శనం. మండలంలో పెద్ద జలాలపురం సమీపంలోని ఒక పొలంలో అక్రమంగా నిల్వ చేసిన డంప్‌ను పోలీసులు రెండు రోజులు క్రితం స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయితే, ఇక్కడ పోలీసులకు సమాచారం తెలిసిపోయిందని, మరుసటి రోజు ఆ నాయకులే మరో చోట ఇసుక డంప్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ క్రమంలో పెరవలి సమీపంలోని కూతలేరు వంకలో టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో సీఐ కౌలుట్లయ్యతో పాటు నార్పల ఎస్ఐ సాగర్ ఆదివారం రాత్రి దాడులు చేశారు. ఓ టిప్పరును పట్టుకొని, శింగనమల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశారు.

టీడీపీలో గ్రూపుల గోల..

మండలంలో పెన్నానది సమీపంలోని కల్లుమడి,



పెరవలి వద్ద ఇసుక డంప్‌లో టిప్పర్‌ను పట్టుకున్న సీఐ, నార్పల ఎస్ఐ

తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, ఉల్లికల్లు, కూతలేరు వంకతో పాటు పెరవలి, పెద్దజలాలపురం, కొరివిపల్లి, సలకంచెరువు, ఇరువెందల, శింగనమల చెరువు వంక నుంచి సోదనపల్లి గ్రామాల సమీపంలో ఇసుక పుష్కలంగా లభ్యమవుతోంది. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు ఇసుక అక్రమ రవాణా ప్రారంభించారు. పగలు జేసీబీ పెట్టి ట్రాక్టర్ల ద్వారా ఒక చోట డంప్ చేస్తూ.. రాత్రికి రాత్రే టిప్పర్ల ద్వారా బయటకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీలో గ్రూపులు ఉండడంతో ఒక వర్గం వారు ఇసుక అక్రమంగా తరలిస్తే మరో వర్గం వారు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తుండడం షరామామూలైపోయింది.

అంతా కృష్ణమయం



జిల్లావ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కృష్ణ మందిరాలు సందడిగా మారాయి. అనంతపురంలోని ఇస్కాన్ మందిరానికి భక్తులు పోటెత్తారు. హరేకృష్ణ నామస్మరణతో మార్మోగించారు. పండుగను పురస్కరించుకుని తమ పిల్లలను చిన్నికృష్ణులు, గోపికలుగా అలంకరించి తల్లిదండ్రులు మురిసిపోయారు. పలు చోట్ల ఉట్లోత్సవాలు ఉత్సాహంగా సాగాయి.

– సాక్షి బృందం



ఉరవకొండలో రాధాకృష్ణుల అలంకరణలో చిన్నారులు



అనంతపురం ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు, శ్రీకృష్ణుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

క్లుప్తంగా

డెంగీతో విద్యార్థిని మృతి


మిస్బాకౌసర్ (ఫైల్)

కణేకల్లు: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన పి.పీరావలి కుమార్తె పి.మిస్బాకౌసర్ (9) డెంగీ బారిన పడి సోమవారం మృతి చెందింది. రెండ్రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆమెకు యర్రగుంట పీహెచ్‌సీలో తల్లిదండ్రులు చికిత్స చేయించారు. జ్వరం తగ్గక పోవడంతో ఆదివారం బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కౌసర్ మృతి చెందింది. డెంగీ లక్షణాలతో ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమార్తె మిస్బాకౌసర్ అదే గ్రామంలో నాల్గో తరగతి చదువుతుండేది.

ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం టవర్‌క్లాక్: వాల్మీకులను ఎస్టీలోకి చేర్చాలనే అంశంపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆ సామాజిక వర్గానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వాల్మీకి భవన్‌లో ఏపీ వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాయకుల సమావేశం జరిగింది. అంతకు ముందు నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశానికి ఎంపీతో పాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు సాగిస్తున్నా ఫలితం దక్కలేదన్నారు. ఇలాంటి తరుణంలో ఐక్య పోరాటాలు తప్ప మరో మార్గం లేదన్నారు. సమావేశంలో వాల్మీకి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కేశవ, జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కనుమ ప్రభాకర్, నాయకులు గంగాధర్, పల్నాడు వెంకటేశ్వర్లు, గోవిందు, ఆదినారాయణ, శ్రీనివాసులు, నాగార్జున, మధు తదితరులు పాల్గొన్నారు.

బోరంపల్లిలో దొంగల హల్‌చల్

- వెంబడించి పట్టుకున్న గ్రామస్తులు

కళ్యాణదుర్గం: మండలంలోని బోరంపల్లిలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. అనంతపురం రోడ్డులో నివాసముంటున్న రాంపురం కాడెన్న ఇంటి వద్ద నిలిపిన బొలెరో వాహనం స్టెఫ్నీ టైరును అపహరించుకెళ్లేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో సమీపంలో ఉన్న వారు గుర్తించి కేకలు వేయడంతో టైర్ తీసుకుని పల్సర్ బైక్‌పై ఉడాయించారు. గ్రామస్తులు వెంబడించడంతో టైర్‌ను చీకట్లో ముళ్లపొదల్లోకి విసిరి పాలిటెక్నిక్ కళాశాల వద్ద బస్టాప్‌కు చేరుకుని నిద్రిస్తున్నట్లుగా నటించారు. కాడెన్న, మరో ఇద్దరు బైకుల్లో అక్కడకు చేరుకుని నిద్రిస్తున్న వారిని అనుమానంతో ప్రశ్నించారు. పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో 100 డయల్‌కు కాల్ చేయడంతో కళ్యాణదుర్గం రూరల్ ఏఎస్‌ఐ రామాంజినేయులు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఆగంతకులను అదుపులోకి తీసుకున్నారు. తొలుత తాము దొంగతనం చేయలేదని బుకాయించినా... పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో టైరు విసిరేసిన ప్రాంతాన్ని చూపించారు. అనంతరం ఇద్దరినీ స్టేషన్‌కు తరలించారు. కాగా, పట్టుబడిన వారిలో ఒకరిది కొండాపురం, మరొకరిది హనిమిరెడ్డిపల్లిగా ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.



ప్రత్యేక చట్టం అవసరం

ప్రాణం పోసే వృత్తి మాది. అలాంటి మా పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. కోల్‌కతా ఘటన అత్యంత బాధాకరం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. వైద్యులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టాన్ని అమలు చేయాలి. డాక్టర్లపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ పావని, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాకెట్ల, ఉరవకొండ మండలం



నిఘా పటిష్టంగా ఉండాలి



అనంతపురంలోని సర్వజనాస్పత్రిలోని 12 లొకేషన్లలో సీసీ కెమెరాలు లేవు. ముఖ్యంగా రాత్రి వేళ విధులు ముగించుకుని హాస్టల్‌కు వెళ్లే మార్గంలో సీసీ కెమెరాలు తక్కువగా ఉన్నాయి. ఆస్పత్రి ఆవరణలో బయట వ్యక్తులే ఎక్కువగా కన్పిస్తుంటారు. వారు ఎవరనేది అర్థం కాని పరిస్థితి. మహిళా వైద్యులు అర్ధ రాత్రి వేళల్లో క్వార్టర్స్‌కు వెళ్లాలన్నా ఇబ్బందిగానే ఉంటోంది. నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉండాలి.

– ఆరీఫ్, పీజీ వైద్య విద్యార్థి, అనంతపురం

సిబిల్ గుబులు!

- నేడు ప్రతి చిన్న వస్తువు కొనుగోలూ ఈఎంఐ విధానంలోనే
- చెల్లింపుల్లో జాప్యంతో సిబిల్ స్కోర్‌కు దెబ్బ
- భవిష్యత్‌లో ఇతర రుణాలు తీసుకోలేని పరిస్థితి
- ఆలస్య రుసుములు, వాటిపైన పన్నుల బాదుడు సరేసరి
- ఆయా కంపెనీల ప్రకటనల వలలో చిక్కుకుంటున్న ప్రజలు
- నియంత్రణ అవసరమంటున్న నిపుణులు



- గౌస్ మొహియుద్దీన్ ఐదు నెలల క్రితం టీవీ కొన్నారు. గత నెలలో ఈఎంఐ కట్టాల్సిన సొమ్ము కంటే రూ.10 బ్యాంకు ఖాతాలో తక్కువగా ఉండటంతో రూ.580 ఆలస్య రుసుము పడటమే కాకుండా సిబిల్ స్కోర్ భారీగా తగ్గింది.
- రమేశ్ నాయుడు అనే డిగ్రీ విద్యార్థి ఓ ఫైనాన్స్ సంస్థ రుణంతో శాంసంగ్ మొబైల్ కొన్నాడు. నాలుగో నెలలో ఈఎంఐ చెల్లించకపోవడంతో మొబైల్‌ను బ్లాక్ చేశారు. తిరిగి దీన్ని పనిచేయించేందుకు ఈఎంఐ కట్టడంతో పాటు రూ.600 ఆలస్య రుసుం చెల్లించాడు. అతడు ఇప్పుడు ద్విచక్ర వాహనం కొనడానికి వెళ్తే.. 'సిబిల్ స్కోర్ పడిపోయింది.. రుణం ఇవ్వలేం' అని చెప్పారు.

.. ఇలా ఒకరు, ఇద్దరు కాదు.. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది సిబిల్ స్కోర్ సరిగా లేక వాహన, వ్యక్తిగత, గృహ రుణాలను పొందలేకపోతున్నారు. చెక్ బౌన్స్ అయితే భారీగా సిబిల్ స్కోర్ పడిపోతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఏ రుణం తీసుకున్నా సకాలంలో చెల్లించాలంటున్నారు. ఆయా రుణ సంస్థలు, బ్యాంకులు నిర్దేశించిన తేదీల్లోగా చెల్లింపులు చేయాలంటున్నారు. ఇలా చేస్తేనే చక్కటి సిబిల్ స్కోర్ సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు. సిబిల్ సరిగా లేకపోతే ఏ రుణం కూడా మంజూరు కాదని చెబుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, అనంతపురం



సిబిల్ లెక్కలివి..

- సగటున ఉండాల్సిన కనీస స్కోర్ 650
- ఏదైనా రుణం రావాలంటే కనీసం ఉండాల్సిన స్కోర్ 600
- గృహరుణం కావాలంటే ఉండాల్సిన స్కోర్ 700కు పైన

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రధాన ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో వస్తువుల కొనుగోలు తీరు ఇలా..	వస్తువు	మొబైల్	ఫ్రిజ్‌లు	టీవీలు	ఇతరత్రా ఉపకరణాలు
	రుణగ్రహీతల సంఖ్య (నెలకు)	45,000కు పైగా	38,000 వరకు	51,500కు పైగా	65,800కు పైగా

ఈఎంఐల్లోనే ఎక్కువ..

ఇప్పుడు దాదాపు ప్రతి ఒక్కరూ నెలసరి వాయిదా చెల్లింపు (ఈఎంఐ) విధానంలో వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. వివిధ బ్యాంకులతోపాటు ప్రైవేటు ఆర్థిక సంస్థలు సైతం క్రెడిట్ (సిబిల్) స్కోర్ ఆధారంగా రుణాలు ఇస్తుండటంతో చాలా మంది ఈఎంఐ విధానంలో వస్తువులను కొంటున్నారు. అయితే నిర్దేశిత తేదీల్లోగా ఈఎంఐ చెల్లించకపోవడం, అందుకు తగ్గట్టుగా బ్యాంకులో నగదు నిల్వ ఉంచకపోవడంతో బౌన్సుల బారినపడుతున్నారు. దీంతో భారీగా ఆలస్య రుసుం, దానిపైన ఇతర పన్నులు చెల్లించాల్సి వస్తోంది. అంతేకాకుండా ఫోన్లలో ఆయా రుణ సంస్థలు, బ్యాంకుల ప్రతినిధుల బెదిరింపులూ తప్పడం లేదు.

నియంత్రించుకోకుంటే కష్టం..

ఇప్పుడు చాలా సులువుగా ఆన్‌లైన్‌లోనూ, వివిధ యాప్స్ ద్వారా రుణాలు లభిస్తున్నాయి. కేవలం పాన్ కార్డు నంబర్‌ను సంబంధిత వెబ్‌సైట్ లేదా యాప్‌లో నమోదు చేయగానే కొద్ది నిమిషాల్లోనే రుణం వచ్చేది, రానిదీ తెలిసిపోతుంది. అలాగే వివిధ ఎలక్ట్రానిక్ మాల్స్, షాపుల్లోనూ పాన్ కార్డు నంబర్‌ను నమోదు చేసి వెంటనే ఎంతవరకు రుణం వస్తుందో చెబుతున్నారు. దీంతో తమకు అవసరమున్నా, లేకున్నా చాలామంది ఎలక్ట్రానిక్స్ వస్తువులపై ఆసక్తితో రుణాల ద్వారా వాటిని కొనుగోలు చేస్తున్నారు. 'జీరో వడ్డీ', 'ప్రాసెసింగ్ ఫీజు లేదు' అంటూ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు ఇచ్చే ప్రకటనల వలలో పడుతున్నారు. ఏ ప్రయోజనం లేకుండా ఆయా సంస్థలు ఎందుకు ఇలా చేస్తాయనే కనీస అవగాహన కూడా లేకుండా వాటి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇలా ఆయా ప్రకటనలకు ఆకర్షితులై వస్తువులు తీసుకుని సకాలంలో చెల్లించలేకపోవడంతో భారీగా ఆలస్య రుసుం, ఇతర జరిమానాలు తప్పడం లేదు. అంతేకాక సిబిల్ స్కోర్ కూడా గణనీయంగా పడిపోతోంది. తద్వారా భవిష్యత్తులో రుణాలు పొందలేని పరిస్థితి తలెత్తుతోంది.

పదిశాతం మందికి పైగా డిఫాల్టర్లే..

రాష్ట్రంలో ప్రైవేటు సంస్థల ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో చెల్లింపులు చేయక డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నవారిలో మొబైల్ ఫోన్‌లు తీసుకుంటున్నవారు ఎక్కువ మంది ఉన్నట్లు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు చెబుతున్నాయి. సాధారణంగా సిబిల్ స్కోర్ 650 దాటితేనే ఏ రుణమైనా లభిస్తుంది. అయితే రుణాలు తీసుకున్న వారు నిర్దేశిత తేదీల్లోగా చెల్లించకపోవడంతో ప్రతి పదిమందిలో ఇద్దరు డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఉపకరణాలు కొనుగోలు చేస్తున్న వారిలో రుణాల రికవరీ అత్యంత తక్కువగా ఉన్నట్లు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు గుర్తించాయి. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం నగరాల్లో డిఫాల్టర్లు 14 శాతంగా ఉన్నారని ఆయా సంస్థలు చెబుతున్నాయి. జరిమానాలు ఎక్కువగా పడటం, చెక్ బౌన్స్ కేసులు నమోదు కావడం, ఈఎంఐల చెల్లింపుల్లో జాప్యం వంటివన్నీ అత్యధికంగా ఈ మూడు ప్రాంతాల్లోనే నమోదవుతున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఈ మూడు చోట్లా సిబిల్ స్కోర్ కూడా గణనీయంగా తగ్గినట్టు తేలింది. ఈ మూడు నగరాలు కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు మిగతా జిల్లాల్లోనూ సగటున 10 శాతం డిఫాల్టర్లు ఉంటున్నారు.

సకాలంలో చెల్లిస్తేనే సిబిల్ బాగుంటుంది..

ప్రస్తుతం సిబిల్ స్కోర్ చాలా కీలకమైంది. సిబిల్‌కు ఆయా ఫైనాన్స్ సంస్థలు చిన్న చిన్న అప్పుల సమాచారాన్ని కూడా ఇస్తాయి. చెల్లింపుల్లో జాప్యం లేదా మొండి బకాయిలు కారణంగా మా దగ్గరకు వచ్చే చాలామందికి సిబిల్ స్కోర్ లేక రుణాలు ఇవ్వడం లేదు. వస్తువు తీసుకున్నాక సకాలంలో చెల్లిస్తేనే సిబిల్ స్కోర్ బాగుంటుంది. లేదంటే భవిష్యత్తులో పరపతి లభించడం చాలా కష్టం.

– సునీల్ కుమార్, మేనేజర్, ఎస్‌బీఐ

'పాత పెన్షన్' తప్ప మరేదీ వద్దు

- యూటీఎఫ్ డిమాండ్
- 30న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయకుండా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపీఎస్)ను తీసుకు రావడాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని యూటీఎఫ్ జిల్లా కమిటీ తేల్చి చెప్పింది. సీపీఎస్ రద్దు చేయకుండా యూపీఎస్ అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడంపై సోమవారం యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వెబెక్స్ నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ యూపీఎస్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ సూచన మేరకు ఈ నెల 30న జిల్లాలోని అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమణయ్య, సహాధ్యక్షులు సరళ, రామప్ప, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు ప్రమీల, హనుమంతరెడ్డి, అర్జున్, రవికుమార్, సంజీవ్ కుమార్, అబ్దుల్ వహాబ్, రఘురామయ్య, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖ ద్వారా టమాట కొనుగోళ్లు

అనంతపురం అగ్రికల్చర్: రైతుల సంక్షేమం దృష్ట్యా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో టమాట కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు ఆశాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు టమాట నాణ్యత తగ్గినట్లు గుర్తించామన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మార్కెటింగ్‌శాఖ ద్వారా కొనుగోలు చేసి రాష్ట్రంలో ఇతర రైతు బజార్‌లకు తరలించి విక్రయించాలని నిర్ణయించినట్లు వివరించారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు.

బంగారం దొంగల అరెస్ట్

- చోరీ చేసిన గంట వ్యవధిలోనే ఛేదించిన పోలీసులు
- ప్రయాణికుల నుంచి బంగారాన్ని కాజేసిన నలుగురు మహిళలు


నగలు చూపుతున్న సీఐ వెంకటేష్‌నాయక్

ఆత్మకూరు: ఆర్టీసీ ప్రయాణికుల వద్ద నుంచి బంగారాన్ని అపహరించిన నలుగురు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదు అందుకున్న గంట వ్యవధిలోనే నిందితులను సీఐ వెంకటేష్ నాయక్, సిబ్బంది గుర్తించి అరెస్ట్ చేయడం గమనార్హం. వివరాలు... పెద్దవడుగూరు మండలం చిత్రచేడు గ్రామానికి చెందిన శ్రీదేవి మూడు రోజుల క్రితం కణేకల్లు మండలం చంద్రగిరిలోని బంధువుల ఇంట శుభకార్యానికి హాజరయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఆమె తిరుగు ప్రయాణమై వస్తూ కళ్యాణదుర్గంలో అనంతపురానికి వెళ్లే బస్సు ఎక్కింది. బస్సు గోళ్ల గ్రామానికి చేరుకోగానే కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన నాగలక్ష్మి ఎక్కింది. అప్పటికే బస్సులో ఉన్న నలుగురు మహిళలు తమ పక్కనే కూర్చొన్న శ్రీదేవి, నాగలక్ష్మికి చెందిన బ్యాగ్‌ల నుంచి బంగారు ఆభరణాలను అపహరించి బస్సు ఆత్మకూరు సెంటర్‌కు చేరుకోగానే దిగారు. ఈ క్రమంలో నాగలక్ష్మి సైతం వేపకుంటకు వెళ్లేందుకు ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సు దిగి బ్యాగ్ జిప్పులు తెరిచి ఉండడం గమనించి వెంటనే పరిశీలించింది. అందులో తాను ఉంచిన బంగారు నగలు కనిపించలేదు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో అనంతపురానికి చేరుకున్న శ్రీదేవి సైతం తన బ్యాగ్‌లోని బంగారు నగలు కనిపించకపోవడంతో చోరీ అయినట్లు గుర్తించి కళ్యాణదుర్గానికి చేరుకుంది. అప్పటికే సీఐ వెంకటేష్ నాయక్ నేతృత్వంలో బృందాలుగా విడిపోయిన పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వడ్డుపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీల్లో ఆటోలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు మహిళలను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. వారి వద్ద 2.50 తులాల లాంగ్ చైన్ ఒకటి, 3.90 తులాల మరో లాంగ్ చైన్ లభ్యమయ్యాయి. మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారణ చేయడంతో బస్సులో ప్రయాణికుల నుంచి చోరీ చేసిన వైనాన్ని వివరించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన కానిస్టేబుళ్లు చౌడప్ప, అతిక్, సురేష్, దస్తగిరి, నాగేంద్రను సీఐ అభినందించారు.

ప్రత్యామ్నాయ విత్తన ధరలు ఖరారు

- నేటి నుంచి ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్లు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీకి సంబంధించి కార్యాచరణ మొదలైంది. 'ప్రత్యామ్నాయం' చూపని సర్కారు' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై ఆగమేఘాలపై వ్యవసాయ శాఖ స్పందించింది. ఈ క్రమంలో కమిషనరేట్ నుంచి ధరలు, సబ్సిడీలు ఖరారైనట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. విత్తనం అవసరమైన రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మంగళవారం నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. అనంతపురం జిల్లాకు సంబంధించి ఉలవలు, పెసలు, అలసంద, మినుము, కొర్రలు, సజ్జలు, జొన్న విత్తనాలు 27,907 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 18,265 క్వింటాళ్లు కేటాయించారు. వీటిని రైతులకు 80 శాతం రాయితీతో పంపిణీ చేయనున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా అన్ని రకాల విత్తనాలు రెండు మూడు రోజుల్లోపు సరఫరా కానున్నాయి. జొన్నలు 3 కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.700 కాగా అందులో 80 శాతం రాయితీ రూ.560 పోనూ రైతులు తమ వాటా కింద రూ.140 ప్రకారం చెల్లించాలి. అలాగే సజ్జలు ఒకటిన్నర కిలో ప్యాకెట్ పూర్తి ధర రూ.370 కాగా, ఇందులో 80 శాతం రాయితీ రూ.296 పోనూ రైతులు తమ వాటా కింద రూ.74 చెల్లించాల్సి ఉంటుంది. ఇవి రెండు ఒక్కో రైతుకు భూవిస్తీర్ణాన్ని బట్టి గరిష్టంగా 5 ప్యాకెట్లు చొప్పున పంపిణీ చేయనున్నారు.

క్వింటా విత్తన ధరలు, రాయితీలు ఇలా...

విత్తనం	పూర్తి ధర	80 శాతం సబ్సిడీ	రైతు వాటా	ప్యాకెట్ బరువు	పంపిణీ గరిష్టం
ఉలవ	రూ.8,700	రూ.6,960	రూ.1,740	10 కిలోలు	5 ప్యాకెట్లు
పెసలు	రూ.13 వేలు	రూ.10,400	రూ.2,600	రూ.4 కిలోలు	10 ప్యాకెట్లు
అలసంద	రూ.11,300	రూ.9,040	రూ.2,260	8 కిలోలు	5 ప్యాకెట్లు
మినుము	రూ.14 వేలు	రూ.11,200	రూ.2,800	4 కిలోలు	10 ప్యాకెట్లు
కొర్రలు	రూ.8,740	రూ.6,992	రూ.1,748	2 కిలోలు	5 ప్యాకెట్లు

దులీప్ ట్రోఫీకి సన్నాహాలు

- ఆర్డీటీ స్టేడియానికి విచ్చేసిన క్యూరేటర్ సుమందర్ సింగ్
- ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటుతో ఊపందుకున్న పనులు
- స్టార్ స్పోర్ట్స్ 1లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు


పిచ్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్/సెంట్రల్: అనంతపురం స్పోర్ట్స్ సెంటర్ వేదికగా సెప్టెంబర్ 5న ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణకు సంబంధించి సన్నాహాలు వేగవంతమయ్యాయి. సోమవారం అనంత క్రీడా గ్రామంలోని ప్రధాన మైదానంలో జిల్లా క్రికెట్ సంఘం ప్రత్యేక పూజలు నిర్వహించింది. క్యూరేటర్ సుమందర్ సింగ్ (మధ్యప్రదేశ్) ప్రధాన స్టేడియంలోని పిచ్, ఔట్ ఫీల్డ్‌ను పరిశీలించారు. సెప్టెంబర్ 5 నుంచి 22వ తేదీ వరకూ ఐదు మ్యాచ్‌లు జరగనున్న విషయం విదితమే. ఈ మ్యాచ్‌లకు ఇండియా స్టార్ ప్లేయర్లు శ్రేయస్ అయ్యర్, సూర్యకుమార్ యాదవ్, రుతురాజ్ గైక్వాడ్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ తదితరులు హాజరుకానున్నారు. దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. ఇందుకు సంబంధించి స్టార్‌స్పోర్ట్స్ 1 ముందుకు వచ్చింది. లైవ్ టెలికాస్ట్‌కు సంబంధించి స్టేడియంలో కెమెరాల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు

దులీప్ ట్రోఫీ నిర్వహణకు సంబంధించి జిల్లా క్రికెట్ సంఘం ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వ్యవహరించనున్నారు. కో చైర్మన్‌గా ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శిగా సయ్యద్ షాబుద్దీన్ (మాజీ రంజీ క్రీడాకారుడు), కన్వీనర్‌గా కె.మధు ఆచారి(ఏడీసీఏ కార్యదర్శి), సభ్యులుగా సాయికృష్ణ (డైరెక్టర్, ఆర్డీటీ), సి.శ్రీకాంత్ (మాజీ ఉపాధ్యక్షుడు, ఏడీసీఏ), పి.మల్లికార్జున (మాజీ ఉపాధ్యక్షుడు, ఏడీసీఏ), ఏజేపీ తీర్థ (మాజీ కార్యదర్శి ఏడీసీఏ), జొన్న జయప్రకాష్ (మాజీ ఉపాధ్యక్షుడు, ఏడీసీఏ), ఎ.యుగంధర్ రెడ్డి (క్రికెట్ కోచ్, ఏసీఏ)ను ఎంపిక చేశారు.

ఉచిత ప్రవేశం

దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు వీక్షించేందుకు త్వరలో పాస్‌లు జారీ చేయనున్నారు. ఈ మేరకు ఆర్గనైజింగ్ కమిటీ ప్రకటించింది. ప్రతి ఒక్కరికీ పాస్‌తో ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. త్వరలో పాస్‌లు జారీకి సంబంధించి విధివిధానాలు రూపొందించి వెల్లడించనున్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి


మృతుడు తేజ

అనంతపురం సెంట్రల్: నగరంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ వసతి గృహంలో ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నాల్గో పట్టణ సీఐ కె.సాయినాథ్ తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన లింగమయ్య కుమారుడు తేజ(16)... అనంతపురంలోని ప్రభుత్వ కొత్తూరు జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాంనగర్‌లోని బీసీ సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం బాత్ రూంకి వెళ్లిన విద్యార్థి టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న స్థితిలో కనిపించాడు. విద్యార్థుల నుంచి విషయం తెలుసుకున్న నిర్వాహకులు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న తేజ... 15 రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లి కళ్యాణదుర్గంలో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థి మృతిపై అనుమానాలు

విద్యార్థి తేజ మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాలిపై 81437 95996 నంబర్ రాసి ఉంది. ఈ నంబర్ ఎవరిది? ఎందుకు రాసుకోవాల్సి వచ్చింది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదిలా ఉంటే విద్యార్థి మృతి చెందాడని హాస్టల్ అధికారులకు తెలియజేసినా వెనువెంటనే స్పందించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, విద్యార్థి మృతిపై మంత్రి సవితమ్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని మార్చురీలో ఉన్న తేజ మృతదేహాన్ని ఆమె పరిశీలించారు. ఘటనపై లోతైన దర్యాప్తు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

యువకుడి ఆత్మహత్య

శెట్టూరు: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం అయ్యగార్లపల్లికి చెందిన హరిజన బాబు (21), లక్ష్మి దంపతులు. గర్భిణి అయిన లక్ష్మికి మూడు నెలల క్రితం అబార్షన్ అయింది. అప్పటి నుంచి ఆమె పుట్టినింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో బాబు మద్యానికి బానిసయ్యాడు. రోజూ తప్ప తాగి వచ్చి ఇంట్లో తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఆదివారం మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాబు తిరిగి రాలేదు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించారు. ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం గ్రామ చెరువు సమీపంలో వెళ్లిన కొందరు రైతులకు చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న బాబు కనిపించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

రేపటి నుంచి కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట


చెన్నేకొత్తపల్లిలో కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కొల్లాపురమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. కొల్లాపురమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో అదే ప్రాంతంలో నూతన దేవాలయాన్ని నిర్మించేందుకు గ్రామస్తులు తీర్మానించారు. దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కలసి భక్తుల నుంచి విరాళాలు సేకరించారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను ప్రతిష్ఠించేందుకు ఈనెల 28 నుంచి 30 వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించిన అనంతరం 30వ తేదీ ఉదయం అమ్మవారి మూల విరాట్‌ను ప్రతిష్ఠిస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలి రండి

కనగానపల్లి: భూ కుంభకోణాలు, పేదల భూ ఆక్రమణలపై ఈనెల 28న విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని ఆ పార్టీ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి మహదేవ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో సీపీఐ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సదస్సులకు భూ బాధితులంతా తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాలరాజు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన మట్కా బీటర్ రఘునాథరెడ్డిని ఇటుకలపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటుకలపల్లి పీఎస్ సీఐ హేమంత్ కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎ.దేవదానం, సిబ్బంది సోమవారం కందుకూరు గ్రామానికి వెళ్లి రఘునాథ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి రూ.1,300 నగదు, పెన్ను, పేపర్ మట్కా పట్టీలను సీజ్ చేసి అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

తాడిపత్రి: ట్రాక్టర్ కిందపడి కదిలి సుదర్శన్ (35) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన తాడిపత్రి పట్టణంలోని నందల పాడులో సోమవారం చోటు చేసుకుంది. హమాలీ పని చేసే సుదర్శన్ ఓబులేసు అనే వ్యక్తి ట్రాక్టర్ ఇంజన్ వెనుక భాగం నుంచి ట్రాలీలోనికి ఎక్కుతున్న సమయంలో ట్రాక్టర్ ముందుకు కదిలింది. దీంతో సుదర్శన్ కిందపడ్డాడు. అదే సమయంలో ట్రాలీ టైర్ సుదర్శన్ మీద పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన సుదర్శన్

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో సోమవారం 67వ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొని శివయ్య (55) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాయలచెరువు గ్రామం నుంచి శివయ్య సొంతూరుకు బైక్‌లో వస్తుండగా మార్గమధ్యంలో క్రిష్టిపాడుకు చెందిన ఓ వ్యక్తిని ఢీకొన్నాడు. అనంతరం డివైడర్‌ను ఢీకొన్నాడు. ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చిన్న రెడ్డప్ప తెలిపారు.

రిమాండ్‌కు కామాంధుడు

కణేకల్లు: కన్న కూతురిపై లైంగిక దాడి చేసిన కామాంధుడు ఎట్టకేలకు కటకటలాపాలయ్యాడు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలిక ఓ స్వచ్ఛంద సంస్థలోని మానసిక వికలాంగుల కేంద్రంలో ఉంటూ చికిత్స చేయించుకుంటోంది. ఆ బాలిక పింఛన్ తీసుకునేందుకు ఆగస్టు 1న ఇంటికొచ్చింది. రెండ్రోజుల పాటు ఇంట్లోనే ఉంది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన తండ్రి కామంతో కళ్లు మూసుకుపోయి కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. గతంలోనూ ఎన్నోసార్లు బాలిక తండ్రి వికృత చేష్టలు చేశాడు. భర్త ప్రవర్తనతో విగిపోయిన భార్య .. తన కూతురుతో సహా శనివారం అనంతపురంలోని దిశ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అనంతపురం అర్బన్ డీఎస్పీ ప్రతాప్‌కుమార్ సదరు గ్రామానికి చేరుకొని నిందితుడి అరెస్ట్ చేసి అనంతపురం కోర్టుకు హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.



నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలి

“ ఆపదలో వచ్చిన క్షతగాత్రులకు వైద్యం చేసి, ప్రాణాలు కాపాడుతున్నాం. ఒక్కోసారి మా కుటుంబం, పిల్లలకు దూరం కావాల్సి వస్తోంది. అయినా వైద్య సేవలే పరమావధిగా విధులు నిర్వహిస్తున్నాం. ఇలా సేవలందిస్తున్నా వైద్యులపై దాడులు చేయడం దుర్మార్గం. కొందరు మద్యం మత్తులో ఆస్పత్రికి వస్తుంటారు. వారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద పూర్తి స్థాయిలో సెక్యూరిటీ గార్డులు, నైట్ వాచ్‌మెన్లు ఉండాలి. వైద్యులు, సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు. నిందితులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే కోల్‌కతా వంటి ఘటనలు పునరావృత్తం కావు.

– చంద్రకళ, స్టాఫ్‌నర్స్, రాప్తాడు పీహెచ్‌సీ



పీహెచ్‌సీల వద్ద భద్రత పెంచాలి


కోల్‌కతాలో వైద్యురాలి హత్య ఘటన అనంతరం బయటకు రావాలంటే భయం వేస్తోంది. మహిళా వైద్యులు, ఉద్యోగులకు భద్రత పెంచాలి. మేము ఒకరిని బతికించడానికి పని చేస్తాం తప్ప కీడు చేయం. పనిచేసే చోటే భద్రత లేకపోవడం విచారకరం. కోలకతా తరహా సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఆస్పత్రుల్లో రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి. కొన్ని సందర్భాల్లో రోగులతో వచ్చే వారితో ఇబ్బందులు వస్తుంటాయి. అటువంటివి జరగకుండా కట్టడి చేయాలి. ”

– లక్ష్మి, స్టాఫ్‌నర్స్, రాప్తాడు పీహెచ్‌సీ



మువ్వ గోపాలా.. కరుణించ రావయ్యా

- భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు


రాంనగర్‌లో కొలువుదీరిన కృష్ణుడు


ఇస్కాన్ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

అనంతపురం కల్చరల్: ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పోటెత్తిన భక్తజనంతో మందిర పరిసరాలు జనసంద్రంగా మారిపోయాయి. గీతాచార్యుడైన పరమాత్ముడిని భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. తొలుత ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు నేతృత్వంలో రాధా పార్థసారథులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. చిన్నారులు చిట్టిపొట్టి కన్నయ్యలుగా ఆడుతూ పాడుతూ దర్శనమిచ్చారు. ఉట్టి ఉత్సవంలో సందడి చేశారు. అదేవిధంగా తెప్పోత్సవంతో శ్రీకృష్ణుడితో జలవిహారం చేయించారు. రాత్రి 'హరే కృష్ణ' నామస్మరణ ప్రతిధ్వనిస్తుండగా మహాపుష్పాభిషేక వేడుకలు కమనీయంగా సాగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, వేలాది మందికి లడ్డూ ప్రసాదాన్ని అందించారు. పలువురు పోలీసు అధికారులు, న్యాయాధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక సంబరాలు..

అనంతపురం కల్చరల్: కృష్ణాష్టమి వేడుక చిన్నారుల్లో ఆనందోత్సాహాలను నింపింది. తల్లులు మురిసిపోయే విధంగా వేషధారణలు, సాంస్కృతిక సంబరాలు, ఆధ్యాత్మిక భావన పెంచే భక్తిగీతాలాపనలతో అనంత ఆనందపరవశమైంది. స్థానిక రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో భావసార క్షత్రియ సమాజ్ వారి ఆధ్వర్యంలో రేపల్లెను తలపిస్తూ అంతా కృష్ణమయం అన్నట్లు చిన్నారులు సందడి చేశారు. దైహండి పేరుతో సాగిన ఉట్టి ఉత్సవం, కూచిపూడి నాటోత్సవాలు, సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. నగరంలోని అరవిందనగర్ శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తిభావాన్ని నింపాయి. చిన్నారుల వేషధారణలు, కోలాట నాట్యాలతో చిన్ని కృష్ణుడికి కళానీరాజనాలర్పించారు. గీతామందిరం, వేణుగోపాల స్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, మూడవ రోడ్డులోని ఉడుపి శ్రీకృష్ణ మఠం పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం తదితర చోట్ల పెద్ద ఎత్తున భక్తజనం పూజల్లో పాల్గొన్నారు.

శిల్పారామంలో..

అనంతపురం రూరల్: కృష్ణాష్టమి సందర్భంగా శిల్పారామంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్శకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. కృష్ణుడు, గోపిక వేషధారణల్లో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక శ్రీకృష్ణుడి ఆలయం, పండమేటి రాయుడు, నీలకంఠేశ్వరుడు, ఆంజనేయుడు, మారెమ్మ, పెద్దమ్మ, చిన్మయనగర్‌లోని వేంకటేశ్వర స్వామి తదితర ఆలయాల్లో పూజలు జరిగాయి. ఆయా గ్రామాల్లో శ్రీకృష్ణుడి చిత్రపటాలను ప్రత్యేకంగా కొలువుదీర్చారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలతో ఆకట్టుకున్నారు. బాలికలు గోపికల వేషాలతో అలరించారు. సాయంత్రం ఎడ్ల బండిపై గ్రామోత్సవం నిర్వహించారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సోమవారం కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్లలో చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు వేయించారు. సాయంత్రం శ్రీకృష్ణుడి విగ్రహానికి వెండి రథంలో గ్రామోత్సవం నిర్వహించారు.


సత్యసాయి దేవాలయంలో పూజలందుకున్న శ్రీకృష్ణుడు


శాస్త్రీయ నృత్యాలతో చిన్ని కృష్ణుడికి నీరాజనం


ఆత్మకూరులో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం


రాప్తాడులో పూజలందుకున్న శ్రీకృష్ణుడు


సత్యసాయి దేవాలయంలో నృత్య ప్రదర్శన


రాధాకృష్ణుల వేషధారణలో చిన్ని కృష్ణులు, గోపికలు


కోలాటం ఆడుతున్న దృశ్యం


ఇస్కాన్‌లో రాధా కృష్ణులను ఊరేగిస్తున్న దృశ్యం

కేసీ కృష్ణ సేవలు చిరస్మరణీయం


కేసీ కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: లలిత కళాపరిషత్తు మాజీ ఉపాధ్యక్షుడిగా, సీనియర్ రంగస్థల నటుడిగా దివంగత కేసీ కృష్ణ రంగస్థలానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం సాయంత్రం ఎల్కేపీలో కేసీ కృష్ణ జయంతి వేడుకలు జరిగాయి. లలిత కళాపరిషత్తు అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, కార్యదర్శి పద్మజ, సంఘాల నారాయణ స్వామి, ఆదినారాయణ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడు, వసంతకుడు వంటి ఎన్నో విభిన్నమైన పాత్రలను పోషించి యువ నటీనటులకు కేసీ కృష్ణ స్ఫూర్తిదాయకంగా నిలిచారని తెలిపారు. అనంత కళారంగానికి తన వంతు సేవగా ప్రతి ఏటా ఒక ప్రతిభావంతుడైన నటుడిని సత్కరించాలని రూ.50 వేలు డిపాజిట్ చేశారని గుర్తు చేశారు. కేసీ కృష్ణ ఆదర్శాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా కృష్ణాష్టమి వేడుకలు కూడా కలిసి రావడంతో లహరి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ బృందావన నృత్యం, ఆర్టీసీ రమణ ఆలపించిన ఘంటసాల మధుర గీతాలు, శ్రీకృష్ణ భక్తిపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎల్కేపీ సిబ్బంది భగవాన్, కుళ్లాయప్ప, వరప్రసాద్, సోమిరెడ్డి, అస్లాం బాషా తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు'

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో దళితులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారు. ఇందుకు సీఎం చంద్రబాబు నైతిక బాధ్యత వహించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కొత్తపల్లి మండలం వెంకటంపల్లి గ్రామానికి చెందిన విద్యా కమిటీ వైస్ చైర్‌పర్సన్ ఇందిర భర్త.. రాజు అనే దళితుడిపై దాడి చేసి గాయపరిచారన్నారు. అదేవిధంగా వారాధమ్మ అనే మహిళ చేయి విరగొట్టారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక దళితులపై వరుస దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశఋారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యా కమిటీ వైస్ చైర్‌పర్సన్ ఇందిర భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని సాకే హరి డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో జేఏసీ నాయకులు రామకృష్ణ, నారాయణ స్వామి, రమేష్, గోపాల్, తదితరులు ఉన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం


పూజలు చేస్తున్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం కల్చరల్: తొలిపూజలందుకునే విఘ్నేశ్వరుడి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకుందామని మేయర్ వసీం సలీం అన్నారు. గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సప్తగిరి సర్కిల్ సమీపంలోని వినాయక చౌక్ వద్ద సెప్టెంబర్ 6 నుంచి 11 వరకూ సాగే వినాయక చవితి వేడుకలకు సోమవారం భూమిపూజ చేశారు. మేయర్ వసీంతో పాటూ డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర రెడ్డి తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటూ జిల్లా వ్యాప్తంగా సాగే ఉత్సవాలు, వేడుకలు భక్తిభావాన్ని పెంచుతాయన్నారు. 1983 నుంచి నిర్విఘ్నంగా వేడుకలను నిర్వహిస్తున్న ఉత్సవ సమితి ప్రతినిధులను అభినందించారు. నిర్వాహకులు వేణుగోపాల్, రమేష్‌బాబు మాట్లాడుతూ.. సెప్టెంబరు 6న వినాయక చౌక్‌లో విఘ్నేశ్వర హోమంతో పాటూ కదలికల వినాయకుడిని ప్రతిష్ఠిస్తామని తెలిపారు. చివరి రోజు నిమజ్జనానికి తరలి వెళ్తుందన్నారు. ఈసారి ఉజ్జయినీ మహాకాళేశ్వర లింగం వృత్తాంతాన్ని నగరవాసులకు పరిచయం చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు శ్యామ్‌జీ, ప్రమోద్, కార్పొరేటర్లు గూడూరు మల్లికార్జున, కమల్ భూషణ్, ఉత్సవ సమితి నాయకులు రామచంద్రయ్య, శ్రీనివాసులు, దీప్తి మురళీ, బీజేపీ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, చిరంజీవి రెడ్డి, లలిత్ కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధేదీ?

- రిపేరీలో పెద్ద ఫాగింగ్ మిషన్లు
- హ్యాండ్ మేడ్ మిషన్లతోనే ఫాగింగ్ చేస్తున్న కార్మికులు
- నగరంలో రెండు డెంగీ కేసులు

అనంతపురం కార్పొరేషన్: జిల్లాను డెంగీ, మలేరియా పట్టిపీడిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు అధికారికంగా 8 డెంగీ కేసులు నమోదైనా.. అనధికారికంగా 50 మందికి పైగా డెంగీ, మలేరియా బారిన పడి ఇబ్బందులు పడ్డవారే. ఇదిలా ఉండగా దోమకాటు నివారణ చర్యలకు సంబంధించి నగరపాలక సంస్థలో అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకు నిలువెత్తు సాక్ష్యమే గత ఏడాదిగా రెండు పెద్ద ఫాగింగ్ మిషన్లు మూలకు పడ్డాయని చెప్పాలి. వీటిని రిపేరీ చేయించడంలో నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

50 డివిజన్లకు 8 పరికరాలే..

నగరంలోని 50 డివిజన్ల పరిధిలో 74 సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాల పరిధిలో 74 వేల హౌస్‌హోల్డ్స్ ఉన్నాయి. దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా ప్రతి డివిజన్‌లో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపట్టాలి. కానీ ఈ డివిజన్లకు కలిపి కేవలం 8 చిన్న ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. పరికరాల కొరతతో రెండు వారాలకు ఒకసారి ఒక డివిజన్ కవర్ అయ్యేలా నగరపాలక సంస్థ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ దిశగా ఫాగింగ్ జరుగుతోంది. వాస్తవంగా ఇంకా మరో 10 నుంచి 15 ఫాగింగ్ మిషన్ పరికరాలు ఉండాలి. ముఖ్యంగా పెద్ద మిషన్లు రిపేరీ అయితే వాటి ద్వారా తరచూ వివిధ డివిజన్లలోని ప్రధాన వీధుల్లో ఫాగింగ్ చేపట్టవచ్చు.

ప్రబలుతున్న జ్వరాలు..

ఇప్పటికే నగరంలో పలు డెంగీ కేసులున్నాయి. అనంతపురంలోని సూర్యనగర్, గుత్తిరోడ్డులోని ఆర్వీ నాయుడు కాలనీలో డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇటువంటి తరుణంలో నగరపాలక సంస్థ అధికారులు మరింత ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంది. మిషన్లు రిపేరీ చేయించడంతో పాటు కొత్త వాటిని కొనుగోలు చేయాలి. రూ.కోట్లలో ప్రజాధనం మూలుగుతున్నప్పుడు మిషన్లు కొనుగోలు చేయకుండా నగరపాలక సంస్థ అధికారులు మీనామీషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.


రిపేరీలో ఉన్న పెద్ద ఫాగింగ్ మిషన్లు


చిన్న మిషన్లతో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

ప్రతిపాదనలు సిద్ధం



ఫాగింగ్ మిషన్లు రిపేరీలో ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం అన్ని డివిజన్లు కవరయ్యేందుకు మరికొన్ని పరికరాల ఆవశ్యకత ఉంది. ఇప్పటికైనా 10 పరికరాలను కొనుగోలు చేయడానికి ఇంజినీరింగ్ అధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో వాటిని కొనుగోలు చేస్తారు. దోమకాటు నివారణ చర్యలు పటిష్టంగా చేపడుతున్నాం.

– డాక్టర్ విష్ణుమూర్తి (ఎంహెచ్‌ఓ)

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

అనంతపురం రూరల్: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.విజయ్ కుమార్ అన్నారు. సోమవారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అనే అంశంపై డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు విజయ్‌కుమార్, ప్రభు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుత తరుణంలో సాంకేతిక రంగం దూసుకుపోతోందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగిపోయిందని తెలిపారు. రోజు రోజుకూ విద్యుత్ వాహనాలు వాడే వారి సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.